

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## అతిథి

**ఫోన్ మోగింది. అప్పుడే పనులన్నీ ముగించుకుని** తీరిగ్గా ఈనాడు పేపర్ అందుకున్న కవిత పక్కనే ఉన్న తన సెల్‌ఫోన్ వంక అసహనంగా చూసింది. అందులో డిస్ప్లే అవుతున్న పేరుని చూడగానే ఆనందంగా దాన్ని ఆన్ చేసి అరిచింది.

"మోహీ! ఎలా ఉన్నావే? ఎంతకాలమైందో నీతో మాట్లాడి"

"కవీ నీతో మాట్లాడాలనిపించి ఫోన్ చేసాను. ఫ్రీయేనా?" మోహిత అడిగింది.

"ఓ! సాయంత్రం ఐదుదాకా నేను ఫ్రీ. చెప్పు. ఏమిటి సంగతి?" కవిత ఉత్సాహంగా అడిగింది.

"కవీ! నేను కిరణ్‌ని పంపేసాను" నెమ్మదిగా చెప్పింది.

"ఎక్కడికి?" అర్ధంకాక అడిగింది కవిత.

"జన జీవన స్రవంతిలోకి" నవ్వింది మోహిత.

"నాది మొద్దుబుర్రని తెలుసుగా మోహీ. నువ్వలా పరాచికాలాడితే నాకు కోపం వస్తుంది."

"ఓకే. ఓకే. విను. నేను కిరణ్‌ని ఇంట్లోంచి, నా జీవితంలోంచి పంపేసాను."

"ఏమిటీ?" నిర్ఘాంతపోయింది కవిత.

"నేనివాళ ఆఫీస్‌కి వెళ్ళలేదు. నువ్వు సాయంత్రందాకా ఖాళీనే అన్నావుగా వస్తావా?"

"అరగంటలో అక్కడుంటాను."

ఫోన్ పెట్టేసి కవిత, తను బయటకి వెళ్తున్నట్లుగా భర్తకి మెసేజ్ పెట్టింది. రెండు బాక్సుల్లో అన్నం, కూరలు పెట్టి వాటిని ఓ బేగ్‌లో పెట్టి తాళం చెవులు తీసుకుని బయటకి నడిచింది. ఆమె మనసు అల్లకల్లోలంగా ఉంది. మోహిత ఎందుకీ నిర్ణయం తీసుకుంది? తర్వాత తన భవిష్యత్తు గురించి ఆలోచించిందా? అసలు కారణం ఏమిటి?" ఆమెకి అన్నీ ప్రశ్నలే తట్టాయి కానీ సమాధానాలు స్ఫురించలేదు. ఏది ఏమైనా మోహిత చాలా పిచ్చిపని చేసింది అనుకుంది.

●●●

తలుపు తీసిన మోహిత బేగ్‌తో లోపలికి వచ్చిన కవితని చూసి నవ్వింది. 'ఆ నవ్వులో జీవం లేదు' అనుకుంది కవిత. స్నానం చేసినట్లు లేదు. ఇంకా నైటీతోనే ఉంది. ఆమె కళ్ళల్లో కన్నీళ్ళు, ముఖంలో విచారం కనపడకపోవడంతో కవిత కొంచెం నిరాశ చెందింది.

"ఇప్పుడు చెప్పు. అసలేం జరిగింది? ఎందుకంత తొందరపడ్డావు?" సోఫాలో కూర్చుంటూ అడిగింది.

"ఏమో అతనితో ఇక కలిసి జీవించలేను అనిపించింది." పొడిగా చెప్పింది మోహిత.

"ఎందుకలా? కిరణ్ మంచివాడే కదా?"

"పురాణాల్లోలా చెడ్డవాళ్ళకి కొమ్ములు, కోరలు ఉంటే బావుండేది కదా?" గలగలా నవ్వింది మోహిత.

"అదుగో మళ్ళీ నాతో పరాచికాలాడుతున్నావు. కిరణ్ మనిషి బానే ఉంటాడు. నీతో బానే ఉంటాడు. మాతో కూడా. నాకు తెలిసి వ్యసనాలేం లేవు. కోపం కూడా తక్కువే. మరి కొమ్ములు కోరలు ఉండే రాక్షసుడంటావే?" ఉక్రోషంగా అడిగింది కవిత.

"అంటే వ్యసనాలున్న వాళ్ళు చెడ్డవాళ్ళా?"

"కాదా మరి?"

"ఓకే. అవి లేనివాళ్ళు మంచివాళ్ళా?"

"అంతేకదా?"

పగలబడి నవ్వింది మోహిత.

"మీ అమ్మ వాళ్ళు చేసిన పెద్ద పొరపాటు నిన్ను మీ అమ్మమ్మ, తాతయ్యల దగ్గర ఉంచడం. వాళ్ళపెంపకంలో ఎంచక్కా పతివ్రతా ధర్మాలు, స్త్రీల వ్రతకథలు నేర్చుకుని చాలా విషయాల్లో కొన్ని కాంక్రీట్ అభిప్రాయాలలో ఉంటావు. అందులో ఒకటి పతియే ప్రత్యక్షదైవం. కదా?"

"అంతే మరి. సంసారం సాగరం. చాలా విషయాల్లో సర్దుకుపోతే కానీ అది నిలబడదు. ఎన్ని ఆటుపోట్లుంటాయి? వాటిని సహనంగా ఎదుర్కోవాలి.

"చాలు. ఆపు. అవి నీ వయసుని మించిన మాటలు. అచ్చం మీ అమ్మమ్మలా మాట్లాడుతున్నావ్" మధ్యలో ఖండించింది మోహిత.

"సరే నాలాగే అడుగుతున్నా చెప్పు కిరణ్‌ని ఎందుకు పంపేసావ్? అతని మీద ఎవరైనా ఏమైనా చెప్పారా?"

"అవును"

"ఎవరు?"

"బద్దెన"

"బద్దెనా?

"ఆయనెవరు? ఎక్కడుంటాడు?" అయోమయంగా అడిగింది.

"ఇప్పుడు లేడు. ఎప్పుడో పదిహేనో శతాబ్దంలో అనుకుంటా ఉండేవాడు. సుమతీ శతకం అని నాలాంటి వాళ్ళకోసం ఓ వంద పద్యాలు రాసాడు" నవ్వింది మోహిత.

కవిత మొహం కోపంతో ఎర్రబడింది.

"మోహీ నీకు వేళాకోళాలాడటానికి ఎవరూ లేక నన్ను పిలిచావా?" తీవ్రంగా అడిగింది.

"సారీ కవితా. హర్ట్ అయ్యావా? నిజానికి నాలో చాలా బాధ ఉందే నువ్వు బహుశా నన్ను చూడగానే అనుకుని వుంటావు. 'మొగుడ్ని వదిలేసానని చెప్పి గుండ్రాయిలా ఏ బాధా లేకుండా ఉంది' అని. చాలా బాధగా ఉంది. అది గొంతులో అడ్డుబడి ఎంత మంటగా ఉందో చెప్పలేను. కానీ అందుకు అతను అర్హుడు కాదు అని నా కన్నీరు బయటకి రావడంలేదు" భారంగా చెప్పింది మోహిత.

"అయ్యయ్యో! సారీ మోహీ. నేనింత సీరియస్ అనుకోలేదు. ఉండు ఒక్క నిమిషంలో వస్తాను. మనం అన్నం తింటూ చెప్పుకుందాం" కవిత కంగారుగా చెప్పి కిచెన్ లోకి వెళ్ళి రెండు స్పూన్స్ తెచ్చి రెండు డబ్బాల్లో వేసి ఒకటి మోహితకిచ్చి చెప్పింది.

"తింటూ మెల్లగా మాట్లాడుకుందాం. చెప్పు. బద్దెన ఏం చెప్పాడు?"

"వంకాయకూర బావుంది."

"చెప్పమన్నానా?" అరిచింది కవిత.

"ఓ.కే విను. చిన్నప్పుడు మనం ఓ పద్యం చదువుకున్నాం. అక్కరకు రాని చుట్టము అని గుర్తుందా?"

"ఓ గుర్తుంది.

**అక్కరకు రాని చుట్టము**
**మ్రొక్కిన వరమీయని వేలుపు మోహరమున దా**
**నెక్కిన బారని గుర్రము**
**గ్రక్కున విడువమగ వలయు గదరా సుమతీ..!"**

కవిత గబగబా చెప్పింది.

"అలా అక్కరకి రాని చుట్టమయ్యాడు కిరణ్. అందుకే అతన్ని వదిలేసాను. ఓకే. నీకు మూడు సంఘటనలు చెప్తాను. వాటి మీద నా విశ్లేషణ చెప్తాను. అవి వింటే నీకు అర్ధమౌతుంది, నేనెందుకీ నిర్ణయం తీసుకున్నానో సరేనా?"

"సరే చెప్పు" ఉత్సాహంగా ముందుకి వంగి కూర్చుంది కవిత.

●●●

పాటలు పాడుకుంటూ వంటిల్లు క్లీన్ చేస్తోంది మోహిత. నాలుగురోజుల్లో పండగ. మధ్యలో వీకెండ్ లేకపోవడంతో ఆ రోజు ఇంటిని శుభ్రం చేసే పనిపెట్టుకుంది. డ్రాయింగ్ రూంలో కూర్చుని పేపర్లో సుడొకు పజిల్ పూర్తిచేస్తున్న కిరణ్‌కి ఢాం అన్న శబ్దం, దాని అనుశృతంగా 'అమ్మో' అన్న అరుపు వినిపించాయి.

"మోహీ ఏమైంది?" పజిల్‌ని దీక్షగా చూస్తూ అడిగాడు.

"పడిపోయాను కిరణ్ ఒకసారిటు రండి" పిలిచింది.

కిరణ్ లేచి కిచెన్‌లోకి వెళ్ళేసరికి చెల్లా చెదురుగా పడి ఉన్న గిన్నెలు, వాటి మధ్య పాలకడలిలో విష్ణుమూర్తిగా పవళించిన మోహిత కనిపించింది. ఫక్కున నవ్వాడు.

"నవ్వింది చాలు కానీ కొద్దిగా లేపండి. నడుం బెణికినట్లుంది. లేవలేకపోతున్నాను" అరిచింది.

అతని సాయంతో నెమ్మదిగా డ్రాయింగ్ రూంలోకి వచ్చి సోఫాలో కూలబడింది మోహిత. తల కిచెన్ ప్లాట్ ఫాంకి కొట్టుకోవడంతో దిమ్మగా ఉంది. తలని వెనక్కి వాల్చి కళ్ళుమూసుకున్న మోహిత కొద్దిసేపటికి సెంట్ వాసన రావడంతో కళ్ళు తెరిచి చూసింది. తెల్లటి నిక్కర్, షర్ట్‌లో ఉన్న కిరణ్ చేతిలోని టెన్నీస్ రాకెట్‌ని గిరగిర తిప్పుతూ చెప్పాడు.

"పడిపోయావుగా పాపం. నాకు వంట చేయద్దులే మోహీ. బయట తిని వస్తాను. నిద్రొస్తే పడుకో. డూప్లికేట్ కీ తీసుకువెళ్తున్నాను."

●●●

రెండో సంఘటన: అత్యవసర పనిమీద గుంటూరు వెళ్ళిన మోహిత పనిపూర్తయ్యేసరికి టైం సాయంత్రం నాలుగైంది. వెంటనే హైదరాబాద్ బస్సెక్కితే రాత్రి పదకొండుకల్లా ఇల్లు చేరుకుని మర్నాడు ఆఫీస్‌కి వెళ్ళిపోవచ్చు అనుకుంది. కిరణ్‌కి ఫోన్ చేసి చెప్పింది.

"వచ్చిన పని అయిపోయింది. బయలుదేరుతున్నాను. బస్ దిల్‌షుక్‌నగర్ రాగానే ఫోన్ చేస్తాను. బస్టాండ్‌కి రండి. పదకొండు దాటొచ్చు. అసలే రోజులు బాగోలేవు."

"సరే" ఒప్పుకున్నాడు కిరణ్.

ఐదుగంటల బస్ ఎక్కి అమ్మయ్య అనుకుంది మోహిత. కానీ ఆ ఆనందం ఎక్కువ సేపు నిలవలేదు. సూర్యాపేట దాటాక ముందు ఏదో పెద్ద ఏక్సిడెంటై ట్రాఫిక్ జామైపోయింది. బస్సుకి ముందూ, వెనకా కూడా వందలకొద్దీ వాహనాలు నిలిచిపోయాయి. అదంతా క్లియర్ కావడానికి కనీసం మూడు నాలుగ్గంటలు పడుతుందని తోటి ప్రయాణీకులు చెప్పుకోవడం విన్న మొహిత కంగారుగా కిరణ్‌కి ఫోన్ చేసి సంగతి వివరించి చెప్పింది.

"బాగా లేటయ్యేలా ఉంది. ఒంటిగంట దాటచ్చేమో? మర్చిపోకుండా బస్టాప్‌కి రండి."

"సరే" ఫోన్ కట్ చేసాడు కిరణ్.

ట్రాఫిక్ క్లియరై బస్ వనస్థలిపురం దాటగానే కిరణ్‌కి ఫోన్ చేసింది. స్విచ్డ్ ఆఫ్. దిల్‌షుక్ నగర్ వచ్చాక చేసింది. అదే సమాధానం. చివరికి రాత్రి ఒకటిన్నరకి బస్ స్టాప్‌లో దిగాక మళ్ళీ ప్రయత్నించింది. అతని ఫోన్ ప్రస్తుతం అందుబాటులో లేదు అన్నది సమాధానం.

ఏం చేయాలో తోచలేదు. ఇద్దరికీ మొబైల్స్ ఉన్నాయి కాబట్టి ఇంట్లో లాండ్‌లైన్ లేదు. తోటి ప్రయాణీకులంతా దిగిపోయారు. భయంతో వణికిపోయింది మోహిత. మిత్రులున్నా ఆ సమయంలో వాళ్ళకి ఫోన్ చేయడానికి వెనకాడింది. చివరికి ధైర్యం చేసి మంచివాడులా కనిపిస్తున్న ఒకతని ఆటోలో సురక్షితంగా ఇల్లు చేరింది.

ఇంట్లో పట్టపగల్లా లైట్లు వెలుగుతున్నాయి. లైట్ ఉంటే కిరణ్‌కి నిద్రపట్టదు. కాబట్టి మెలుకువగా ఉన్నాడు. మరి ఫోన్ ఛార్జ్ ఎందుకు పెట్టలేదు అనుకుంటూ బెల్ నొక్కింది. తలుపు తీసిన కిరణ్ వెళ్ళి సోఫాలో కూర్చుని మళ్ళీ టీ.వీ చూడసాగాడు. షోలే సినిమా క్లైమాక్స్ వస్తోంది.

సినిమా మొత్తం పూర్తయ్యాక నిస్త్రాణగా మూలబడి ఉన్న భార్యతో చెప్పాడు.

"వచ్చేసావన్నమాట. షోలే చూసి ఎన్నేళ్ళయిందో. ఇన్నాళ్ళకి మళ్ళీ టీవీలో వచ్చింది. అడ్వర్‌టైజ్ మెంట్లు మరీ ఎక్కువున్నాయి. అందుకే ఐదుగంటలకి మొదలైన సినిమా ఇప్పటికి పూర్తయింది. ఎన్నిసార్లు చూసినా ఎంత బావుంటుందో."

"ఫోన్‌ని ఎందుకు ఛార్జ్ చెయ్యలేదు?" కోపంగా అడిగింది.

"ఫోనా? ఓ! ఫుల్ ఛార్జ్ ఉంది. కాకపోతే ప్రశాంతంగా సినిమా చూడనీకుండా ఒకటే కాల్స్. అందుకని స్విచాఫ్ చేసి పారేసా" నవ్వుతూ చెప్పాడు.

"అంటే? నేను కాల్ చేస్తానని తెలుసు. నన్ను పికప్ చేసుకోడానికి రావాలి అని తెలుసు. ఐనా కమ్యూనికేషన్ లేకుండాచేసారు. అంతేనా మీ దృష్టిలో నా విలువ?" అరిచింది.

"ష్! అర్ధరాత్రి ఏంటా అరుపులు. పక్కవాళ్ళు లేస్తారు. ఐనా వచ్చేసావుగా నీమీద నాకు నమ్మకం ఉందిలే సేఫ్‌గా వచ్చేస్తావని" బెడ్‌రూంలోకి నడిచాడు కిరణ్.

●●●

"ఈ రెండు సంఘటనలు వింటే నీకేమనిపించింది?" అడిగింది మోహిత.

"చిన్ని నా పొట్టకి శ్రీరామ రక్ష టైప్ అనుకుంటా" ఆలోచనగా చెప్పింది కవిత.

"ఎగ్జాక్ట్‌లీ. దాన్నే స్వార్థం అంటారు. మొదటి ఉదాహరణ తీసుకుందాం. 'నా భార్య కింద పడింది, ఆమెకి ఏమైనా సహాయం కావాలా?' అన్న కన్సర్న్ లేదు. డాక్టర్ దగ్గరకి తీసుకు వెళ్తాను అన్న మాటే లేదు. ప్రతీ శనివారం కూడా వెళ్ళాలి అంతే. ఇంకో కొసమెరుపు ఏమిటంటే, జాలి. నా మీద బోలెడు జాలి కురిపిస్తూ 'నా కోసం వంట చేయద్దులే. బయట తిని వస్తాను. పాపం పడ్డావుగా! అంటాడు. అంతేకానీ నా భోజనం సంగతి అతనికి పట్టలేదు. 'నీ చావు నువ్వు చావు' అని ఇండైరెక్ట్‌గా చెప్పాడు. నేను క్లియర్‌గా ఉన్నానా?"

"అవును. ఆలోచిస్తే నువ్వు చెప్పినవన్నీ నిజాలే" ఒప్పుకుంది కవిత.

"ఇక రెండో సంఘటనకి వస్తే, ఆ సాయంత్రం టి.వీలో షోలే వస్తుందని అతనికి ముందే తెలుసు. దాన్ని ఇరవయ్యోసారి చూసేప్పుడు వచ్చే ఆనందం, భార్యని బస్‌స్టాండ్ నుంచి పికప్ చేసుకొచ్చే ఆనందం కన్నా ఎక్కువ అని తెలుసు. అలాంటప్పుడు నా మొదటి కాల్ వచ్చినప్పుడు అంటే సాయంత్రం నాలుగ్గంటలకే ఆ విషయం చెప్పచ్చుగా? నీలాంటి ఫ్రెండ్స్‌కి ఫోన్ చేసి నా ఏర్పాట్లు నేను చేసుకునేదాన్నికదా? ట్రాఫిక్ జామ్ గురించి రెండుసార్లు కంగారుగా కాల్ చేస్తే డిస్టబెన్స్ అని ఫోన్ స్విచాఫ్ చేసాడు. 'నాకు తెలుసు నువ్వు సేఫ్‌గా వస్తావని' అని పొగడ్త కూడా. భార్యని అంత నిర్లిప్తంగా చూసేవాడితో ఎలా కాపురం చేస్తాం చెప్పు?"

"నిజమే" కవిత మళ్ళీ ఒప్పుకుంది.

ఈ రెండో సంఘటన తర్వాత నేను కొద్దిగా సీరియస్‌గా కిరణ్ గురించి ఆలోచించాను. ఇలాంటివి చాలా మెదిలాయి. అతను చాలా స్వార్థపరుడు. మేము ఈ ఇల్లుకొనేప్పుడు, కారు కొనేప్పుడు లోన్స్ నా జీతానికి అటాచ్ చేసాడు. 'మన అనుకున్నాక లోన్ ఎవరు తీరిస్తే ఏమిటి?' అన్నాడు. నిజమే అనుకున్నా. కానీ తర్వాత అర్థమైంది. అతను వేరే ఏదైనా మంచి కంపెనీలోనో లేదా విదేశంలోనో జాబ్ చూసుకుంటే, ఈ లోన్ అటాచ్‌మెంట్స్ ప్రతిబంధకాలవుతాయి. నేను మాత్రం ఈ అప్పులు తీరుస్తూ ఇదే కంపెనీలో వేలాడుతుండాలి. అతను చకచకా పైకి ఎదిగిపోవాలి. కాకపోతే దీని వల్లనే ఇవాళ అతన్ని 'ఇది నా ఇల్లు' అని చెప్పి వెళ్ళగొట్టగలిగాను. "దీర్ఘంగా నిట్టూర్చింది మోహిత.

కవిత సానుభూతిగా చూసింది.

"మూడో సంఘటన రాత్రి జరిగింది. ఒకరాత్రి వేళ కిరణ్ నన్ను తట్టిలేపి చెప్పాడు. 'మోహీ వంటింట్లో ఏదో చప్పుడవుతోంది. ఏ దొంగైనా దూరాడేమో? నువ్వసలు వెనక తలుపు సరిగ్గా లాక్ చేసావా? ఒకసారి వెళ్ళి చూడు."

ఫక్కున నవ్వింది కవిత. తర్వాత తప్పు చేసినట్లుగా చూసింది.

"ఫర్లేదు. ఇదే నవ్వే విషయమే. నేను లేచి వెళ్ళి చూసాను. ఏ దొంగా కనపడలేదు. తలుపులు భద్రంగా లాక్ చేసి ఉన్నాయి. నేను తిరిగి బెడ్ రూంలోకి వచ్చిపడుకున్నా కానీ నిద్రపట్టలేదు. 'ఈ మనిషితో చివరిదాకా ప్రయాణం చేయగలనా?' అన్న ఆలోచన నన్ను నిద్రపోనీయలేదు. భర్త అంటే భరించువాడు. ప్రస్తుతం ఆడ మగ అందరికీ స్వంత సంపాదన ఉంటోంది కాబట్టి ఆర్థికంగా భరించనవసరంలేదు. కానీ ఒక భర్త భార్యకి ఇవ్వాల్సిన రక్షణ, సపోర్ట్ నాకు కిరణ్ ఇస్తున్నాడా అని ఆలోచించాను. లేదు. అతని డిక్షనరీలో 'నేను' తప్ప 'మనం' లేదు. పెళ్ళయ్యాక నువ్వు, నేను కలిసి ఏకవచనంలా ఉండాలి తప్ప భార్యా లేదా భర్తో 'నా' అని మాట్లాడితే వాళ్ళు భాగస్వామికి న్యాయం చేసినట్లు. అతను అరవడు. కోప్పడడు. ఎప్పుడూ చిరునవ్వుతో ఉంటాడు. కానీ అతనికి ఎంత జీతమో నాకు తెలీదు. కనీసం కూరగాయలు లాంటివి కొని తేవడం కూడా అతనికి తెలీదు. లోన్ అటాచ్ మెంట్స్ ఉన్నా కూడా నాకు మంచి జీతమే వస్తుంది. సో నేను అతన్నించి ఆర్థికంగా ఏమీ ఆశించను. కానీ ఒక భాగస్వామిలా అతను నా ఖర్చులని కానీ, భావాలని,

అభిప్రాయాలని కానీ పంచుకోలేదు. అవి అతనికి అనవసరం. నాకు ఇష్టమైన రంగు తెలీదు. పాటలు తెలీదు. నేను అభిమానించే రచనలు తెలీదు. అతనికి ఏమీ తెలీవు. తన గురించి మాత్రం నాకన్నీ తెలుసు. ఎందుకంటే అతను చక్కటి వక్త. కానీ మంచి శ్రోతకాడు. నా ఇష్టాఇష్టాల మీద అతనికి ఆసక్తి లేదు. అన్నట్లు మూడో సంఘటన మీద నా విశ్లేషణ చెప్పలేదు కదా? దొంగ వచ్చాడేమో అన్న అనుమానంతో పాటు నువ్వు వెనక తలుపు సరిగ్గా వేసావా? అని సందేహం. అంటే, నువ్వు తలుపులు సరిగ్గా వేయలేదు కాబట్టి దొంగ వచ్చినా, వాడు నా తల బద్దలు కొట్టిపోయినా నీదే పూచీ నాదికాదు అనే పలాయన వాదం. ఆలోచిస్తూంటే ఇలాంటి పదులు, వందల సంఘటనలు - చిన్నవి పెద్దవి గుర్తొస్తూంటే, నాకు చాలా దుఃఖంగా అనిపించింది. నేను చిన్నప్పటి నుంచి చదువులో ఫస్ట్. ఇప్పుడు ఆఫీస్‌లో కూడా నాకు తెలివిగలది అని పేరు. అలాంటి మేధావిని నేను ఎంత అమాయకంగా నా చిరునవ్వుల భర్తని భరించాను? తన అవసరం కోసం నాతో బతికే అతిధిని నేనెందుకు ఇంతకాలం గుర్తించలేకపోయాను?" దుఃఖంతో మాట్లాడలేక ఒక నిమిషం చెప్పేది ఆపింది మోహిత.

ఓదార్పుగా ఆమె భుజం మీద తట్టింది కవిత.

"అంతే ఈ చివరి సంఘటనతో నాకు జ్ఞానోదయమైంది. అతను నిద్రలేవగానే చెప్పాను 'గెట్‌లాస్ట్' అని. తెల్లబోయాడు. 'నువ్వు నాకు వద్దు. ఇది నా ఇల్లు. నువ్వు దయచేసి నీ సామానంతా తీసుకుని వెళ్ళిపో. త్వరలో డివోర్స్ తీసుకుందాం' అని చెప్పాను. కిరణ్‌కి ఏం జరిగిందో అర్థంకాలేదు. కానీ తప్పదు కాబట్టి తన వస్తువులు సర్దుకుని వెళ్ళిపోయాడు. బహుశా నాకు కోపం వచ్చింది, అది తగ్గగానే రావచ్చు అనుకుని ఉంటాడు. నీకీ విషయం తెలుసా? ఈ ఇంట్లోంచి అతని వస్తువులు, అతను ఇంటికోసం కొన్న వస్తువులు తీసుకెళ్ళమన్నాను. అన్నీ సర్దుకుంటూంటే చూస్తూండిపోయాను. అతను తీసుకెళ్ళింది రెండు పెద్ద సూట్ కేస్‌ల నిండా బట్టలు. మరో బేగ్‌లో సోప్స్, షేవింగ్‌సెట్ లాంటివి. ఇంకో బేగ్‌లో రకరకాల షూస్, చెప్పులు. ప్లస్ లాప్‌టాప్. అంతే. ఐదారేళ్ళ వైవాహిక జీవితంలో ఈ అక్కరకి రాని చుట్టం కేవలం తన బట్టలు, తన చెప్పులు లాంటివి తప్పించి 'మన' కోసం ఏదో కొనలేదని, దేనికీ తన డబ్బుని వెచ్చించలేదని ఇండైరెక్ట్‌గా చెపుతూ వెళ్ళిపోయాడు. ఇవన్నీ అమ్మావాళ్ళకి చెపితే వాళ్ళు అర్థం చేసుకోలేరు. అందుకే నీకు చెప్పాలనిపించింది. నువ్వో పతివ్రతా శిరోమణివి కదా? నీ అభిప్రాయం ఏమిటో నిర్మొహమాటంగా చెప్పు కవితా. నేను తప్పు చేసానా?" అడిగింది మోహిత.

"నువ్వు చాలా ఆలస్యం చేసావు మోహీ! ఈ నిర్ణయం ఇంకా ముందు తీసుకుని ఉంటే బావుండేది. నీ తెలివితేటలు ఏమైపోయాయ్ పిచ్చిమొద్దూ." కవిత ఆమె చేతిని అందుకుంటూ ఆవేశంగా చెప్పింది.

***(వచ్చే సంచికలో మరో సరిగమ)***

Click here to share your comments on this story